సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,26 సెప్టెంబర్ 2024



# డిపట్టాలు అసైన్డు భూములు ఆన్‌లైన్ చేయండి




**– కలెక్టర్ మహేష్ కుమార్**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** డి పట్టాలు జారీ చేసి 20 సంవత్సరాలు దాటిన అసైన్ భూములకు ఉచిత హక్కులు కల్పించిన వివరాలన్నీ వెబ్ ల్యాండ్లో ప్రస్ఫుటంగా కనిపించేలా అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లో జిల్లా రెవిన్యూ అధికారి ఆర్డీవోలు రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి అసైన్ భూములు, 22 ఏ భూములు విలేజ్ సర్వీస్ ఈనామ్ భూములు, అడంగల్ వివరాలు డివిజన్లవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అంశంపై ఎక్సర్సైజ్ చేసి పూర్తి వివరాలను అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఈ భూములకు వివరాలు ఉన్నతాధికారులు కోరి ఉన్నారని క్షేత్రస్థాయిలో భౌతికంగా విచారించి ఆ యొక్క వివరాల సేకరణకై పూర్తి ఎక్సర్సైజ్ నిర్వహించి స్పష్టమైన వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. 20 సంవత్సరాలు పైబడిన అసైన్ భూములలో ఒరిజినల్ ఎస్సైని ఉన్నారా లేదా లీగల్‌గా ప్రకారం వారి వారసులు ఉన్నారా థర్డ్ పార్టీ వారు అనుభవదారులుగా ఉన్నది కూడా వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి.కేశ వర్ధన రెడ్డి, జె.వి.వి. సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, తేజేశ్వరరావు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం, పూర్తిస్థాయిలో రోడ్ల అభివృద్ధికి చర్యలు

- దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలిండర్లు.. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు
- ఉండ్రాజవరం మండలం సత్యవాడ గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరణ
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం
- సంక్షోభంలోనూ సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమంటూ వెల్లడించిన మంత్రి కందుల దుర్గేష్
- మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులను ఆశీర్వదించిన మంత్రి దుర్గేష్




**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** సంక్షోభంలోనూ సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమంటూరాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వ పాలన 100 రోజులు పూర్తైనసందర్భంగాబుధవారం ఉదయం నిడదవోలు నియోజక వర్గం ఉండ్రాజవరం మండలం సత్యవాడ గ్రామంలో నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఇది మంచి ప్రభుత్వం" పోస్టర్లను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులను మంత్రి దుర్గేష్ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తై ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అయినప్పటికీ తాము "ఇది మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వ పనితీరును తెలుసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలను సైతం వివరిస్తున్నామన్నారు. ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకొని ప్రజామోదంతో, గృహ యజమాని అనుమతితో స్వయంగా ఇంటిగోడకు స్టిక్టర్ లు అతికిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వల్ల తమకు మంచి జరుగుతుందని ప్రజలే స్వయంగా చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. గతంతో పోల్చితే కూటమి ప్రభుత్వ పనితీరు వెయ్యిరెట్లు బాగుందని ప్రజలు చెబుతున్నారని మంత్రి వివరించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వాల మొదటి 100 రోజుల పాలనలో తేడా గమనించాలని మంత్రి దుర్గేష్ ప్రజలను కోరారు. మహిళా చైతన్యమే ఇంటిని, రాష్ట్రాన్ని, సమాజాన్ని, దేశాన్ని బాగుపరుస్తుందని ప్రగాఢంగా నమ్ముతున్నామన్నారు. మహిళలకు మంచి జరగాలన్న ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందులో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని దీపావళి నుండి అమలు చేస్తామన్నారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం హామీని నెరవేరుస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశామన్నారు. వారసత్వంగా లభించిన ఆస్తిపై గత ప్రభుత్వాధినేత ఫోటోలు ఉండటం సరికాదని, వాటిని తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వ రాజముద్రను వేశామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి 15 రోజుల్లోనే సామాజిక భద్రతా పెన్షన్లను రూ. 3 వేల నుండి 4 వేలకు పెంచి ప్రజలకు గుమ్మం వద్దే అందించామన్నారు. దివ్యాంగులకు రూ.3 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు పెన్షన్లు అందిస్తున్నామన్నారు. తద్వారా ఇంటి అవసరాలకు వినియోగిస్తూనే, ఆరోగ్యాన్ని సైతం కాపాడుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఖజానాను ఖాళీ చేసిందని మంత్రి తెలిపారు. జల్ జీవన్ మిషన్ నిధులు పక్కదారి పట్టించిందన్నారు. రైతన్నలకు ఇవ్వాల్సిన ధాన్యం బకాయిలు రూ.1600 కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. నాడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా గత పాలకులు కాలయాపన చేశారన్నారు. గత ప్రభుత్వ తీరుతో లబ్ధిదారులు బ్యాంకు లోన్లు కట్టడంతో పాటు అద్దె కూడా చెల్లించాల్సిన పరిస్థితి ఎదురైందన్నారు. ఈ నేపథ్యంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని మంత్రి దుర్గేష్ భరోసానిచ్చారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించి అపవిత్రం చేశారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులను సరిదిద్ది ప్రజల మంచి కోసం, అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గడిచిన 5 ఏళ్లలో అధ్వాన్న స్థితికి చేరుకున్న రోడ్లను సరిచేయాలన్న ఉద్దేశంతో తొలుత రిపేర్ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీచేశారన్నారు. త్వరలోనే నిధులు సమీకరించుకుని పూర్తిస్థాయిలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామాల్లోపారిశుద్ధ్యంపూర్తిగా దెబ్బతిన్న దని ప్రజలుతెలుపగాత్వరలోనే పరిశుభ్రతకు చర్యలు చేపడతామన్నారు. త్రాగునీరు అందించాలని విన్నవించగా ప్రజా సమస్యల పరిష్కారం కోసమే తాము ఉన్నామని త్వరలోనే ఒక్కొక్కటిగా సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు విజయవాడ నగరం ముంపుకు గురైందని, ఈ క్రమంలో 75 ఏళ్ల వయస్సును సైతం లెక్కచేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటికి కూడా వెళ్లకుండా కలెక్టరేట్ ఆఫీస్ ను సచివాలయంగా మార్చుకొని అధికార బృందం, ప్రజా ప్రతినిధులతో కలిసి అహర్నిశలు శ్రమించి సాధారణ స్థితికి తీసుకువచ్చారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా వరద ప్రాంతాల్లో పర్యటిస్తే సహాయక చర్యలకు విఘాతం కల్గుతుందని భావించి తాను వ్యక్తిగతంగా వరద బాధితుల సహాయార్థం రూ.6 కోట్లు విరాళం అందించిన విషయం గుర్తుచేశారు. గత ప్రభుత్వంలా తమది ఏకపక్ష ప్రభుత్వం కాదని పేద ప్రజల కష్టాలు తెలిసిన ప్రభుత్వమని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. 100 రోజుల్లోనే ఇన్ని కార్యక్రమాలు చేయగలిగామని సగర్వంగా చెప్పుకునేందుకు ఇది మంచి ప్రభుత్వం పేరుతో జనాల్లోకి వచ్చామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు తామున్నామని చెప్పేందుకే మీ ముందుకు వచ్చామన్నారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 100 ఏళ్లు పూర్తయ్యే సందర్భంగా 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా రూపుదిద్దుకునేలా చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సత్యవాడ గ్రామానికి వస్తుంటే చిరుత సంచారం అనే వార్తల నేపథ్యంలో రాజమండ్రి సమీపాన కడియపులంకలో ఆగాల్సి వచ్చిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. అక్కడ అటవీశాఖ అధికారులు, సిబ్బందితో చిరుత సంచారంపై సమీక్ష నిర్వహించి సమస్యపై ఆరా తీశానని, సాధ్యమైనంత త్వరగా చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించానన్నారు. ఈ క్రమంలో సత్యవాడ కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చానని మంత్రి వివరించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు, అధికారులు, గ్రామ సర్పంచ్ , ఎంటీసీ, నియోజకవర్గ నేతలు, మండల అధ్యక్షులు, స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'గంజాయి' వాడకంతో యువత భవిష్యత్తు నాశనం



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** గంజాయి వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని రంపచోడవరం ఎస్ఐ మోహన్ కుమార్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దర్ ఆదేశాలు మేరకు రంపచోడవరం అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జగదీశ్ హడహల్లి సూచనల మేరకు రంపచోడవరం సిఐ ఆర్.జె. రవి కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ మోహన్ కుమార్ రంపచోడవరం లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో గంజాయి నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్ కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ యువత ఎక్కువగా గంజాయికి బానిసలు అవుతున్నారని, గిరిజన ప్రాంతాల్లో గంజాయి రవాణా, వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని కోరారు. అలాగే గంజాయి వలన కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేసారు. అదే విధంగా యువత మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని, కాబట్టి మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని తెలియజేసారు. గంజాయి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మోహన్ కుమార్ కోరారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుని యువత వారి జీవితాలు నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

# తంటికొండ ఈఓగా వద్దాది



**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** దేవాదాయశాఖ కాకినాడలో పనిచేస్తున్న వద్దాది సత్యనారాయణను తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తండికొండ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కార్య నిర్వహణ అధికారిగా నియమించారు. మొన్నటి సాధారణ బదిలీల్లో కాకినాడ జగన్నాధపురం గ్రూపు దేవస్థానాల ఈఓగా పనిచేస్తున్న వద్దాది సత్యనారాయణ ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో పి.కే. లక్ష్మణరావును నియమించారు. కానీ సత్యనారాయణకు పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఆయన ఈ విషయాన్ని కమీషనర్ కార్యాలయానికి తెలియజేశారు. సత్యనారాయణకు పోస్టింగ్ ఇవ్వని విషయాన్ని కమీషనర్ కార్యాలయం గుర్తించింది. దీంతో అక్కడ ఇన్చార్జిగా పనిచేస్తున్న ఈవోను తప్పించి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా వద్దాది సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పొలంబాట పట్టిన వ్యవసాయాధికారులు



**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** మూడురోజుల నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు పొలాలు నాశనం అవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పొలం బాట పట్టారు.కాకినాడ జిల్లా వనరులకేంద్రం ఏడిఏ పి.మాధవి కరప సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాబూరావు సబ్ డివిజన్ పరిధిలోని కరప, తాళ్లరేవు, కాజులూరు మండలాల్లో సాగవుతున్న పొలాలు, ప్రస్తుత పరిస్థితులను ఆయా మండల వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేళంగిలోని పొలాలను సందర్శించారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి పొలాలు పిలకల దశ నుంచి అంకురం ఏర్పడే దశలో ఉన్నట్లు తెలియజేశారు. ఈ దశలో వర్షాలు పడడం వల్ల వర్షం పంటలకు ఉపయోగకరంగా ఉంటుంది అన్నారు. వర్షాలకు రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడారు. వరి దుబ్బులు పరిశీలించారు. ఎరువులు, పురుగుమందులు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి అసిస్టెంట్ డైరెక్టర్లు మాధవి, బాబురావు వివరించారు. వ్యవసాయాధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు

**– ఎనర్గాన్ లాజిస్టిక్స్ ఏజన్సీ ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ భావన**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బయో మెథనేషన్ ప్లాంట్‌ను కాకినాడ నగరంలో ఏర్పాటు చేయనున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎనర్గాన్‌లాజిస్టిక్స్ వారు రూపొందించిన ప్రాజెక్టు ప్రజంటేషన్‌ను కమిషనర్ భావన పరిశీలించారు. పీపీపీ పద్ధతిలో సుమారు రూ.20 కోట్లతో ఏర్పాటు చేయబోయే ఈ ప్లాంట్‌కు సంబంధించిన వివరాలను ఎనర్గాన్ లాజిస్టిక్స్ హైదరాబాద్ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. బయోగ్యాస్‌ను ఎలా ఉత్పత్తి చేయబోయేది చూపించారు. నగరంలోని డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న తడిచెత్తను ప్రాసెసింగ్ చేసి బయో గ్యాస్‌గా రూపొందిస్తారని కమిషనర్ తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు చేయడమే కాదు..

దాని నిర్వహణ బాధ్యతను ఎనర్గాన్ లాజిస్టిక్స్ ప్రతినిధులే నిర్వర్తిస్తారన్నారు. దీని వల్ల నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరుతుందని, చెత్త నుంచి సంపద సృష్టించినట్టు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ భావన, ఎస్ఈ వెంకట్రావు, ఎనర్గాన్ లాజిస్టిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు

# రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

- కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే "పిల్లి"
- వలసపాకల, వేములవాడ గ్రామాల్లో మంచి ప్రభుత్వం కార్యక్రమం





**కాకినాడ రూరల్ / కరప, మేజర్ న్యూస్ :** మెగా డిఎస్సీ, అన్నా క్యాంటీన్లు ప్రారంభం, పింఛను పెంపు, ల్యాండ్ టైటిలింగ్ రద్దు, తుఫాన్ బాధితులను ఆదుకోవడంలాంటివి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్విజయంగా పరిపాలన సాగించారని కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి కొనియాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం వలసపాకల, వేములవాడ గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని కూటమి నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం పంప్లెట్లను పంచి ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తిలు మాట్లాడుతూ..ప్రజల భవిష్యత్తుకు భరోసా కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చేసే జీవన ప్రమాణాలు పెంచేందుకు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇచ్చిన అన్ని హామీలు కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని, గతంలో జగన్మోహన్ రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇచ్చి రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి చేశారన్నారు. సీఎం అయిన నాటి నుంచి రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం అస్తవ్యస్త పాలనతో గాడి తప్పిన రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేస్తూ ఇది మంచి ప్రభుత్వంగా ప్రజల మనసులు చూరగొంటుందని అన్నారు.వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన ఎం.కృష్ణ కుమారి, విశాఖపట్నంలోని ఎస్ఈబీ విభాగంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం కాకినాడ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏటి డబ్ల్యూఓ లు, గిరిజన సంక్షేమశాఖ ప్రధానోపాధ్యాయులు, గురుకుల ప్రిన్సిపాల్‌లు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్ లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు క్వాలిటీ విద్యను అందించాలని ప్రాజెక్ట్ అధికారి ఉపాధ్యాయులు ఆదేశించారు. ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నది రిజిస్టర్ మెయింటినెన్స్ చేయాలన్నారు. విద్యార్థులను కొట్టకుండా విద్యను బోధించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అనారోగ్యంగా ఉంటే వెంటనే ఆస్పత్రుల్లో చేర్చి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల లోపలికి అనుమతులు లేకుండా ఇతరులను అనుమతించరాదని ఆయన అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల కంట్రోల్లో ఉండాలని, అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు మాట ఎవరైనా వినకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలను సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు రిప్రాస్మెంట్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు క్వాలిటీ విద్య అందించే విధంగా ప్రధానోపాధ్యాయులు పూర్తి బాధ్యత వహించాలన్నారు.

గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలలో ప్రతి నెల మూడో శనివారం పారిశుధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునే విధంగా ఒక గ్రూపు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి స్కూల్లో విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచాలని ఆయన అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రతిరోజు సకాలంలో ఉపాధ్యాయులు ఎఫ్.ఆర్.ఎస్. హాజరయ్యాలని అదేవిధంగా ఏమైనా సమస్యలు ఉన్నాయెడల నా దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ గిరిజన సంక్షేమశాఖ అధికారులు రామ తులసి, కృష్ణమోహన్, సూపర్డెంట్ బి.కిషోర్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, గిరిజన సంక్షేమశాఖ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యపై అవగాహన పెంచేందుకు కృషి చేయాలి

**– ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభలో ఎమ్మెల్యే రాజప్ప**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** అధిక విద్యాభ్యాసం పొంది క్వాలిటీ విద్యను అందించే ఉత్తమ ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నందున కార్పొరేట్ విద్యకు ఆకర్షితులయ్యే తల్లిదండ్రులకు ప్రభుత్వ నాణ్యమైన విద్యపై పూర్తి అవగాహన కల్పించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న అవార్డు గ్రహీతలతో పాటు సామర్లకోట మండల పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కార అభినందన కార్యక్రమం మండల శాఖ అధికారులు వై శివరామకృష్ణయ్య, పి పుల్లయ్యల అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం తగ్గుతుండగా కార్పొరేట్ పాఠశాలల్లో వంలాదిగా విద్యార్థుల శాతం పెరుగుతూ వస్తుందన్నారు. కాగా ఏ రకమైన విధులైన ఉత్తమ సేవలు అందించే అధికారులకు, ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు అదిక ప్రాధాన్యతనిస్తున్నట్టు ఆయన చెప్పారు. పవిత్రమైన విద్యా సేవలో ఉన్న ఉపాధ్యాయులందరూ సమాజానికి దిక్సూచిగా ఉంటారన్నారు. ఉత్తమ సమాజాన్ని తయారు చేయడంలో ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరించిన మండల పరిషత్ వేట్లపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే బలరాం చౌదరి కాపవరం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు అద్దంకి వెంకన్నబాబు లతోపాటు మండల కాంప్లెక్స్ ల పరిధిలోని ఉత్తం ఉపాధ్యాయులు టీవీవి సత్యనారాయణ, పి నాగమణి, కే విద్యా వాణి, బివిఎస్ఎన్ మూర్తి, ఎం ఇజ్రాయేలు, డి సూర్యకుమారి, ఎం త్రిమూర్తులు, ఎస్వి రామారెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు వై శివరామకృష్ణయ్య, పి పుల్లయ్య, ఎంపీడీవో డి శ్రీలలిత లను దుస్సాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, బిజెపి పెద్దాపురం నియోజకవర్గ నాయకులు విత్తనాల వెంకటరమణ, తెదేపా నాయకులు గుమ్మళ్ళ రామకృష్ణ,పాలకుర్తి శ్రీను బాబు తోటకూర శ్రీనివాస్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, బడుగు శ్రీకాంత్,ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేఎంఆర్ ప్రసాద్ ఎన్ నాగరాజు ఎంబీఎన్ దేవి, చిట్టిబాబు సత్యనారాయణ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు సాయిరాం కృష్ణ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్పీలు, మండల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యనమల దివ్య ఆధ్వర్యంలో "ఇది మంచి ప్రభుత్వం"




తుని, మేజర్ న్యూస్ : ఎన్డీయే కూటమి ప్రభుత్వం 100 రోజులలో సాధించిన ప్రగతిపై "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా తుని శాసనసభ్యులు యనమల దివ్య ఆధ్వర్యంలో తుని నియోజకవర్గ పరిశీలకురాలు, సుంకర పావని తిరుమల కుమార్ తుని మండలం కొలిమేరు గ్రామంలో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని కుమ్మరిలోవ, ఎన్.ఎస్.వేంకట నగరం గ్రామాలలో ఇంటింటికి వెళ్లి స్టికర్ అంటించి ప్రజలకు 100 రోజుల ప్రగతిని వివరిస్తు పర్యటించారు. ఈ కార్యక్రమంలో తుని నియోజక వర్గ తెలుగుదేశం నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతనీడి అబ్బాయ్ గార్లు ,జనసేన, బీజేపీ నాయకులు పాల్గొనుట జరిగినది.

## గిరిజన సంక్షేమ డిడిగా కొండలరావు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్‌గా ఐ.కొండలరావు బుధవారం బాధ్యతలు స్వీకరించడం జరిగింది. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో నూతన డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ నుండి బదిలీపై రంపచోడవరం ఐటీడీఏ కు రావడం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు అనారోగ్యంగా ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా హెల్త్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు ఉంటే వాటిని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# కోనేరు ప్రక్షాళనకు చర్యలు వహించిన కలెక్టర్ అభినందనీయులు

**– త్రిపురసుందరి కోనేరు నైరుతి దిక్కులో నాగశివలింగం అపహరణకు గురయ్యింది..**

**– ఆధ్యాత్మిక పార్కుగా అభివృద్ధి చేయాలి..**

**– భోగిగణపతిపీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజాపిర్యాదులు పరిష్కార వేదికలో భోగి గణపతిపీఠం అందించిన వినతిపై జిల్లా కలెక్టర్ వహించిన చర్యల మేరకు బాలత్రిపుర సుందరి ఆలయ కోనేరు ప్రక్షాళన చేపట్టారని పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ఇక్కడి ప్రాంగణాన్ని పరిశీలించిన రమణరాజు ఆశ్చర్యకరమైన విషయాన్ని వెలు గులోకి తెచ్చారు. 2013లో పిండాల చెరు వును ఎండగట్టి హెూమాలు నిర్వహించిన క్రమంలో చెరువు గట్టు మీద అమ్మవారి 6 శక్తి స్వరూపాల శిలావిగ్రహాలు, నైరుతి దిక్కులో నాగ శివలింగం ప్రతిష్ట చేశారని, వాటిని కాకి రెట్టలకి గాలికి డంపింగ్ చెత్తల నడుమ వదిలి వేయడంతో నాగ శివ లింగం పూర్తిగా డంపింగ్ చెత్తల్లో కప్ప బడిపోయిందన్నారు. స్వయంగా పార తీసుకువెళ్ళి డంపింగ్ చెత్తలను వెలికితీయడం చేయగా నాగ శివలింగం ఎక్కడా కనిపించలేదన్నారు. బయటి వ్యక్తులు అపహరించారన్నారు. బయట ఆరాతీయగా ఆరునెలల క్రిందట కొంత మంది శివలింగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కొందరు పెకలించి తీసుకుపోయినట్లు చెప్పారన్నారు. అదృశ్యమైన నాగ శివలింగం ఎక్కడికి పోయిందో! ఎవరు తీసుకు వెళ్ళారో!! దర్యాప్తు జరగాలన్నారు. అమ్మవారి శక్తిదేవతా విగ్రహాలకు వర్షం పడినప్పుడు మాత్రమే ఆకాశగంగ అభిషేకం తప్ప ఇతర రోజుల్లో ఎటువంటి ఆగమ శాస్త్ర విధులు పరిశుభ్రత జరగడం లేదన్నారు.



విగ్రహాల పరిరక్షణ కోసం పై అచ్ఛాదనగా గొడుగులు గ్రిల్ నిర్మాణం చేయించాలన్నారు. కేవలం నర్సరీలకు కోనేరు ఆవరణ లీజు కిచ్చి నాశనం చేస్తున్నారన్నారు. వాకింగ్ ట్రాక్ బాగు చేయించి లైటింగ్ స్థంభాలు నెలకొల్పి చెరువు నీటిని తోడించి అడుగున వున్న మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు మృత కళేబరాలు తొలగించి ప్రక్షాళన చేయడం ద్వారా గట్టు నాలుగు వైపులా వాకింగ్ ట్రాక్ బాగు చేయించి సిమెంట్ బెంచీలు నెలకొల్పి సౌండ్ సిస్టం ద్వారా భక్తి గీతాలు అందించి సంపూర్ణ ఆధ్యాత్మిక పార్కుగా అభివృద్ధి చేయాలన్నారు. పక్షులు వాలని చెట్లు వలన ఉపయోగం లేని విష వృక్షాలుగా పేరొందిన కోనోకార్పస్ చెట్లు కోనేరు బయట దట్టంగా ఏర్పడి వున్నందున వాటిని భూమి లోపలి వ్రేళ్ళతో సహా పెకలించి వేప మొక్కలు నాటించే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయం సమీపంలోని రామాలయం వీధి బాదం వారి వీధి అసాంఘిక శక్తులకు మద్యం గంజాయి సేవించే వారికి రాత్రి వేళల్లో అడ్డాగా మారుతున్నందున ఫ్లడ్ లైట్లతో వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని, పోలీస్ గస్తీ నెలకొల్పాలని రమణరాజు విజ్ఞప్తి చేసారు. దేవాదాయశాఖ నగర పాలక సంస్థ శ్రద్ధ వహిస్తే త్రిపుర సుందరీ కోనేరులో ఆధ్యాత్మిక పార్కుఅందుబా టులోకి వస్తుందన్నారు. నగరానికి స్పెషల్ ఆఫీసర్‌గా వున్న జిల్లా కలెక్టర్ ఎండోమెంట్స్ కమీషనర్ తగిన చర్యలు చేపట్టాలని భోగి గణపతి పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు విజ్ఞప్తి చేశారు.ఆలయ నూతన ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరీ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు.

## ఆర్యవైశ్యుల ఉన్నతికి తన వంతు కృషి చేస్తా

**– అధ్యక్షుడు మట్టే వరప్రసాద్**



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఆర్యవైశ్యుల ఉన్నతికి తన వంతు కృషి చేస్తానని కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మట్టే వీర వెంకట వరప్రసాద్ అన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ సర్వసభ్య సమావేశం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగింది.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నూతనకార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగాయి.ఎన్నికల అధికారిగా నాగవరపు మహేష్ వ్యవహరించారు. ఆర్యవైశ్య సంఘ కార్యదర్శిగా కొల్లెపర శ్రీనివాస్, కోశాధికారిగా తుమ్మలపల్లి నాగ రమేష్, వాసవి ట్రస్ట్ చైర్మన్‌గా కక్కిరాల సోమయ్య ఎన్నుకోబడ్డారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మట్టే ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ సభ్యులు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘ అభివృద్ధికితన వంతు కృషి చేస్తానని అన్నారు.తనకు సంఘ సభ్యులు సహకరించాలని అందరినీ కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవరపు గోపాలకృష్ణ,ఎంబీబీఎస్ ప్రసాద్,మద్దుల సత్యనారాయణ,మద్దుల నాని, కక్కిరాల సూరిబాబు, వలివేటి ప్రసాద్,గంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గాన గంధర్వులు బాలుకు ఘననివాళి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గాన గంధర్వులు శ్రీ పండితారాద్యుల బాల సుబ్రహ్మణ్యం నాల్గవ వర్ధంతి "రాకా" సంస్థ మరియు గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాకా అద్యక్షులు డాక్టర్ కంటే వీరన్న చౌదరి బాలు సాంస్కృతిక మందిరంలో వీరన్న చౌదరి అద్యక్షతన జరిగింది, బాలు జీవితం వడ్డించిన విస్తరి కాదని ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నత స్థానానికి చేరారని కొనియాడారు. శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న సినిమాతో ప్రారంభమైన గాయక జీవితం ఏబై మూడేళ్ళు ఏభై వేల పాటలు, వందలాది చిత్రాలకు సంగీతం అందించారని కార్యాద్యక్షుడు యర్రమోతు ధర్మరాజు వివరించారు, భమిడిపాటి రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ఏ వ్యక్తి ఆయనను తలవని వారుండరు తెలుగు వానిగా జన్మించడం మన అదృష్టం అన్నారు.

దేవకుమార్ మాటలతో పాటు బాలు పాడిన కొన్ని పాటలు ఆలపించారు, కె.ఎన్.గౌరీశంకర్ మాట్లాడుతూ పాడుతా తీయగా ద్వారా ఎందరో యువ కళాకారులను జాతికి పరిచయం చేసి జన్మ ధన్యం చేసుకున్నారన్నారు. కోశాధికారి సూరపరెడ్డి తాతారావు మాట్లాడుతూ చెన్నై లో ఆయన స్వగృహంలో ఆయన చూపిన ఆత్మీయత మైమరపించింది, ఎంత ఎదిగినా ఏమాత్రం భేషిజం లేని మహెూన్నత వ్యక్తిత్వం బాలు గారిది అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రంధి జగన్నాధం, క్రిష్ణ మోహన్, ముదెడ్ల రమేష్, నాగరత్నం, కె.ఎస్.వి. పద్మలత, డాక్టర్ హేమనళిని, శ్రేష్ఠ దత్తాత్రేయ శర్మ, రామ క్రిష్ణమూర్తి, శ్రీహరి, సత్యనారాయణ చౌదరి, వై.కె.స్వామి బాలు, సంగీతాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధికి కాకరపర్రు ప్రజలచే రూ.లక్ష విరాళం

**– మంత్రి దుర్గేష్‌కు మాజీ ఎమ్మెల్యే శేషరావుకు అందించిన చెక్కు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఇటీవల విజయవాడలో బుడమేరు పొంగి వరదలు సంభవించి విజయవాడ మరియు పరిసర ప్రాంతాల ప్రజలను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేసిన సంగతి తెలిసినదే. ఆ వరద సహాయ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కులు అందించిన సంగతి తెలిసిందే.

అయితే చాలా బాగా చెక్కులు పారిశ్రామికవేత్తలు సంపన్నులు వ్యక్తిగతంగాను ఇస్తుంటే కాకరపర్రు గ్రామ ప్రజలు వరద బాధితుల కష్టాలను ప్రసారమాధ్యమాల ద్వారా చూసి చలించి వరద బాధితులను ఆదుకోవాలని సదుద్దేశంతో గ్రామస్తులంతా తలో చేయి వేసుకుని లక్ష రూపాయలను ప్రోగు చేసి మంగళవారం తమ గ్రామ పర్యటనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ టూరిజం సినిమాటోగ్రఫీ పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు మాజీ శాసనసభ్యులు నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు లకు చెక్కు రూపంలో అందించారు. కాకరపర్రు గ్రామస్తుల కృషిని వారి దాతృత్వాన్ని మంత్రి దుర్గేష్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు లు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు సంగీత నాగు టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు సంగీత జయరాజ్ తదితర కూటమి నాయకులతో పాటు తాసిల్దార్ డి అచ్యుతకుమారి ఎంపీడీవో ఎస్ రమేష్ మండల ప్రత్యేక అధికారి సునీల్ వినయ్ హౌసింగ్ ఏఈ విక్టర్ బాబు ఎలక్ట్రికల్ ఏఈ ఎం డేవిడ్ నిచ్చల్ ఏపీఎం బండారు రామకృష్ణ సీఐ శ్రీనివాస్ ఎస్ఐ పి అప్పారావు తదితరులతో పాటు గ్రామస్తులు అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# సంకేతాలు గుర్తించండి... ఆరోగ్యంగా ఉండండి

**– ఊపిరితిత్తుల వైద్యులు డాక్టర్ భీమశంకర్**




**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించిన సంకేతాలను విస్మరించడం వలన తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఎప్పటికీ నిర్లక్ష్యం చేయకూడదని ఊపిరితిత్తుల వ్యాధులుగా నిరంతర దగ్గు, శ్వాస ఆడకపోవడం గురక, చాతి నొప్పి రక్తం రావడం గుర్తించవలసిన విషయాలని ప్రముఖ ఊపిరితిత్తుల డాక్టర్ భీమశంకర్ తెలిపారు.ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవ సందర్భంగా కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ వైద్యులు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచనలతో, బుధవారం జిల్లా పోలీసు అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సు నందు ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యులు, డా.భీమ శంకర్ గారు మాట్లాడుతూ... వ్యక్తి శరీరంలోని ముఖ్యమైన అవయవాలలోఊపిరితిత్తులు ఒకటి అని, ఊపిరితిత్తులు శరీరం అంతటికీ ఆక్సీజన్‌ను చేరవేస్తుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఊపిరితిత్తుల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25వ తేదీన ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించిన సంకేతాలను విస్మరించడం వలన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని, ఎప్పటికీ నిర్లక్ష్యం చేయకూడని ఊపిరితిత్తుల వ్యాధులుగా నిరంతర దగ్గు,శ్వాస ఆడకపోవడం, గురక, ఛాతి నొప్పి, రక్తం కారడం గుర్తించవలెను అని వివరించారు. ధూమపానానికి దూరంగా ఉండటం, వాయు కాలుష్య కారకాలు మరియు కొన్ని రసాయనాలకు గురికాకుండా నివారించడం, సెకండ్ హ్యాండ్ పొగను నివారించడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రెగ్యులర్ చెకప్‌లు పొందడం,శారీరకంగా చురుకుగా ఉండటం, టీకాలు తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధుల నివారించగలమని డాక్టర్‌గారు వివరించారు.ఈకార్యక్రమంలో జిల్లా పోలీసు సిబ్బంది, మెడికవర్ సిబ్బంది పాల్గొన్నారు.

## కూనవరం మండలంలో ఎమ్మెల్యే పర్యటన



**కూనవరం, మేజర్ న్యూస్ :** అభిచర్ల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం 100 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం నాడు ఆ భిచర్ల గ్రామంలోని ఇంటింటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా రంపచోడవరం నియోజకవర్గం శాసనసభ్యులు మిరియాల శిరీషదేవి పాల్గొని ఇంటింటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమం విజయవంతం చేయటం జరిగింది. అలాగే పెద్దార్కుర్ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసిన సందర్భంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది.

ఈ గ్రామ సభకు ముఖ్య అతిథులుగా రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు శిరీష దేవి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో ఇచ్చిన హామీలు ప్రకారం వృద్ధాప్య పెన్షన్ 3000 నుంచి 4000 ఇవ్వటం జరిగింది. అలాగే వికలాంగులకు 3000 నుంచి 6000 ఇవ్వటం జరిగింది అన్న క్యాంటీన్లు ప్రారంభించడం జరిగింది మెగా డీఎస్సీ అలాగే ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేయడం జరిగింది. అనేది ప్రజలకు చెప్పడం జరిగింది. అలాగే ఇక ముందు జరిగే కార్యక్రమాల గురించి కూడా చెప్పడం జరిగింది మహిళలకు వంట గ్యాస్ దీపావళి ఇవ్వబోతున్నాము అలాగే మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇచ్చే కార్యక్రమం కూడా చేయబోతున్నామని చెప్పడం జరిగిం టిడిపి నాయకులు బరపాటు ప్రకాశరావు గడ్డిపాటి ప్రసాద్ సాయిలు రాజేష్ బిజెపి నాయకులు పాయం వెంకయ్య నోముల రామారావు జనసేన నాయకులు నరేంద్ర బండారు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్యం పాటిస్తే ఆరోగ్యకర సమాజం

**– అభివృద్ధే ధ్యేయంగా వంద రోజుల పాలన – ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**




**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో పారిశుధ్యం పాటిస్తే ఆరోగ్యకర సమాజం సాధించుకోవచ్చుని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.ర్యాలీ గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ వంద రోజులు ప్రజా సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని చెప్పారు. హామీ మేరకు ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి నాలుగు వేల రూపాయలు పింఛను ఇచ్చామని తెలిపారు. డీఎస్సీ అభ్యర్థుల కోసం పదహారు వేలకు పైగా ఖాళీలను భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటి సంతకం చేశారని గుర్తుచేశారు. ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలో నష్టపోయిన బాధితులకు గత చరిత్రలో లేని విధంగా పరిహారం ఇవ్వడం జరుగుతుందని పంచాయితీరాజ్‌శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ అధికారం చేపట్టిన వందరోజుల పాలనలో గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన పంచాయతీలకు పూర్వపు వైభవం వచ్చేలా కృషి చేస్తున్నారని అన్నారు. అంతకుముందు గ్రామంలో జరిగిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమలో ఆయన పాల్గొని పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామాన్ని శుభ్రం చేసి, మొక్కలు నాటారు. రామాలయం వీధిలో ఇంటింటికీ తిరిగి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ స్టిక్కర్లను అతికించారు.చివరగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక హైస్కూల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ముల్లపూడి భాస్కరరావు పేరిచర్ల పల్లవరాజు వర్మ పుల్లవ రాజు కొడమంచిలి లక్ష్మి బోనం సాయిబాబా, కాయల జగన్నాధం,మద్దూరి సుబ్బారావు,పెండెం వెంకన్న మెర్ల నాగేశ్వరరావు,బందెల గుర్రాయ, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలింగి రవిచంద్ర, కరుటూరి వరప్రసాద్,ముత్తాబాతుల రాజు,కుదపకృషమూర్తి, మద్దింశెట్టి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శిరీష దేవి ముందు గ్రామ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకువచ్చిన సర్పంచ్ నాగమణి



కూనవరం, మేజర్ న్యూస్ : పెదర్కూరు స్థానిక సర్పంచ్ అయిన నన్ను గ్రామ సభకు అధ్యక్షత వహించమని చెప్పకుండా రాజకీయ నాయకులే సభను మొదలు పెట్టించి నడిపిన సరే నా గ్రామ పంచాయతీలోని సమస్యలను పరిష్కరించిన చాలు అని నాగమణి అన్నారు. కూనవరం మండలం పెద్ద ఆర్కుర్ గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే శిరీష దేవి పర్యటన సందర్భంగా, మండల అధికారులు ఎమ్మెల్యేగారు ముందు సమస్యలు ఏకరువు పెట్టిన సర్పంచ్ నాగమణి, మండలంలోని 40 అడుగులు గోదావరి వరదనీటికే విద్యుత్ పోల్స్ మునిగిపోతున్నాయిఅని పవర్ సప్లై ఆపేస్తున్నారని ఈ కారణంగా పెద్ద ఆర్కుర్ గ్రామపంచాయతీతో పాటు మిగతా గిరిజన గ్రామాలకు రోజులు తరబడి అందాకారంలో ఉండవలసి వస్తుందని గత కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని, మరియు రెండవసారి గోదావరి వరదలు వచ్చినప్పుడు మండలంలోని అన్ని గ్రామాలకు నిత్యవసర వస్తు ఇచ్చారు. కానీ పెద్ద ఆర్కుర్ గ్రామపంచాయతీ ప్రజలకు ఇవ్వలేదని 10000 రూపాయలు ఆర్థిక పరిహారం కూడా ప్రకటించలేదని తక్షణమే ప్రకటించాలని అధికారు వద్ద ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవట్లేదని మరియు పోలవరం బ్యాక్ వాటర్ వలన చిన్న వరదల కె మండలంలోని అన్ని గ్రామాలు మునిగిపోతున్నాయని ప్రతి సంవత్సరం ఇలాగే వచ్చే వరదలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని కావున పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రావలసిన నష్టపరిహారం త్వరగా ఇప్పించి గలరని అలాగే గత వరదల్లో మిర్చి నార్లు వరి నార్లు వరి పంటలు వరదనీటికి మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని అలాగే గండి కొత్తగూడెం రోడ్డు కంకర రాళ్లు తేలిపోయి చాలా అధ్వానంగా ఉన్నాయని ఆ రోడ్డు మంజూరు చేయించి త్వరగా పనులు పూర్తి చేయించాలని నాగమణి గ్రామ సభలో ఎమ్మెల్యేగా దృష్టికి తీసుకువచ్చినారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ డి అమ్మాజీ, ఎక్స్ ఎం పి టి సి పాయం సత్యనారాయణ, గిరిజన సంఘం మండల నాయకులు బాబు బొర్రయ్య ,తెల్లం తమ్మయ్య పోడియం రామారావు, వార్డు మెంబర్లు స్థానిక ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విమానాశ్రయ నుంచి వొచ్చే నీరు ప్రవహించే కాలువల ఆక్రమణలు తక్షణం తొలగించాలి

**– ఆక్రమణలపై సమన్వయ రెవిన్యూ అధికారులు జాయింట్ తనిఖీ చేపట్టాలి**

**– కలెక్టర్ పి.ప్రశాంతి**

**మధురపూడి, మేజర్ న్యూస్ :** అధిక వర్షపాతం నమోదు కారణంగా విమానాశ్రయం నుంచి విడుదల అయ్యే నీరు వలన చుట్టుపక్కల ప్రాంతాలలో పంట భూముల ముంపు నివారణా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా ఆక్రమణల తొలగింపు పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు పి ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం మధురపూడి విమానాశ్రయం అనుకుని ఉన్న మధురపూడి, ఉండేశ్వరం, బూరుగు పూడి గ్రామాలలో విమానాశ్రయ, రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ పర్యటించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర విమానయాన శాఖ మంత్రి జిల్లా పర్యటన సందర్భంలో మధురపూడి విమానాశ్రయం సందర్శించి అధికారులతో , ప్రజా ప్రతినిధులతో స్థానిక సమస్యలపై సమావేశం నిర్వహించా రన్నారు. విమానాశ్రయం నుంచి వర్షాలు కురిసే సమయంలో విడుదల అయ్యే వృధా జలాలు విమానాశ్రయం కు చెందిన 16 ఎకరాల చెరువు కు చేరే మార్గంలో కాలువ ఆక్రమణ కు గురి అయినట్లు , కొన్నీ చోట్ల మరింత ఇరుకుగా ఉండడం క్షేత్ర స్థాయిలో గమనించడం జరిగిందన్నారు. రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఆక్రమణలు తొలగింపు పై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ సర్వే చేపట్టాలని, ఆమేరకు నివేదిక అందచేయాలని పేర్కొన్నారు.అంతకు ముందు రహదారి విస్తరణ కు చెందిన రూట్ మ్యాప్ ను అనుసరించి అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయా రూట్ మార్గంలో పర్యటించి క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డీవో కె.ఎల్. శివజ్యోతి , ఎయిర్ పోర్ట్ అధికారి ఎస్. జ్ఞానేశ్వర రావు, కోరుకొండ తహసిల్దార్ వి. సుస్వాగతం, ఇరిగేషన్ డి ఈ – కె.ఆనందబాబు రెవెన్యు, విమానాశ్రయ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
తూర్పుగోదావరి
గురువారం,
26 సెప్టెంబర్ 2024


# తిరుపతి లడ్డూపై సిబిఐ విచారణ జరిపించాలి



కొవ్వూరు,మేజర్‌న్యూస్: తిరుపతి లడ్డుపై రాజకీయలు మాని సిబిఐతో విచారణ జరిపిం చాలని మాల సంఘాల జాక్ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ ప్రభుత్వని డిమాండ్ చేసారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మతావిద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం బాధాకరం అన్నారు. లడ్డు తయారీలో కొవ్వుపదార్థాలు వాడితే అవి చెడిపోతాయని కర్ణాటక పుణ్యక్షేత్రల క్వాలిటీ కంట్రోలర్ ప్రకాష్ కుమార్ స్పష్టంగా చెప్పారని తెలిపారు. నెయ్యి తయారీలో కల్తీకోసం పందికొవ్వు మాత్రమే ఉపయోగిస్తారని ఇది తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బ తీయడం దుర్మార్గం అన్నారు. హిందువులు రోడ్లపైకి రావాలని పవన్ కళ్యాణ్ పిలుపునివ్వడం సిగ్గుచేటని ఎవరైనా ప్రతిపక్షంలో వున్నప్పుడు ఇటువంటి చర్యలకు పాల్పడుతరని ఉప ముఖ్యమంత్రి హొదాలో ఇలా ప్రవర్తించడం దిగజారుడు తననికి నిదర్శనం అన్నారు. ఎప్పటికైనా ప్రజలు వాస్తవాలను గ్రహించలని రవిప్రకాష్ పేర్కొన్నారు.

## విద్యార్థులారా డ్రగ్ బారిన పడవద్దు పోలీస్ శాఖ అవగాహన సదస్సు



**కూనవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఐపీఎస్ చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఐపిఎస్ ఆదేశాల మేరకు కూనవరం జూనియర్ కాలేజీలో విద్యార్థులకు గంజాయి మరియు డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కన్నప్ప రాజు మరియు కూనవరం పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు కాలేజీలో విద్యార్థులకు కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయటం జరిగిందని ఎస్ఐ కే శ్రీనివాస్ తెలిపారు.

# వరిలో ఎండాకు తెగులు పట్ల అప్రమత్తంగా ఉండండి

### – ఏరువాక కోఆర్డినేటర్ నరసింహారావు

**పెరవలి, మేజర్ న్యూస్ :** అధిక వర్షాలు, తెగులుని పూర్తిగా తట్టుకోలేని బిపిటి 5204, పిఎల్ఏ 1100, ఎంటియు 1318, సంపద స్వర్ణ, స్వర్ణ, ఎంటియు 1282, ఎంటియు 1121, ఎంటియు 1224, పిఆర్ 126, కేఎస్ఆర్ 1638, వంటి రకాల సాగు అధిక నత్రజని వాడకం, పటాస్ వాడకపోవడం, మరియు తెగులుసోకినపొలంనుండి ఆరోగ్యంవంతమైన పొలాలకు సాగునీటి ప్రవాహం వంటి కారణాలవల్ల "బ్యాక్టీరియా ఎండాకు తెగులు"తూర్పుగోదావరిజిల్లాలో పలు గ్రామాల్లో ఆశించిందని తెగులు నివారణకు సరైన మందులు లేవు కనుక లక్షణాలపై అవగాహన ఏర్పరచుకుని సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల నష్టాన్ని చాలా వరకు తగ్గించుకునే అవకాశం ఉన్నదని తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మరియు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మేజర్ న్యూస్ కు తెలియజేశారు. మంగళవారం మంత్రి దుర్గేష్ పర్యట లో పాల్గొనే నిమిత్తం పెరవలి మండలం వచ్చిన డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో వరి పంటను సుమారుగా 70 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారని ప్రస్తుతం పంట ఈనిక దశలో ఉందని ఎండాకు తెగులు పంటను ఆశించిందని నివారణ చేయని పక్షంలో పిలకలు ఎండిపోయి కొన్ని వెన్నులే బయటకు రావడం లేదా బయటకు వచ్చిన పాక్షికంగా రావడం లేదా గింజలు రావటం జరుగుతుందని ఆయన అన్నారు. తెగులు నిర్ధారణ కొరకు ఊజ్ పరీక్ష : ఎండిన ఆకులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి మంచినీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలి. ఇలా చేయడం వల్ల తెగులు సోకిన భాగాల నుండి బ్యాక్టీరియా నీటిలోకి ప్రవహించడం వల్ల కొద్ది గంటల తర్వాత నీటి గాడత పెరగటం మరియు పసుపు రంగుకు మారటం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లు గుర్తించాలి అన్నారు. అదే కారణం కుళ్ళ ఆశించిన పిలకలను గమనిస్తే మొదటి కణుపు వద్ద కుళ్ళి నలుపు



రంగుకు మారి పిలకలను చీల్చి చూస్తే మొదటి కనుపు వద్ద నల్లగా మారుతుంది. బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించిన మొక్కలు ఇటువంటి కుళ్ళ లక్షణాలు కనిపించకుండానే పిలకలు ఎండిపోతాయి అన్నారు. అనుకూల పరిస్థితులు సాధారణంగా పిలకలు కట్టే దశలో ఎడతెరిపి లేకుండా గాలులతో కూడిన వర్షాలు పడుతున్న వాతావరణం లోను ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెంటిగ్రేట్ కన్నా తక్కువ ఉన్నటువంటి వాతావరణం లోనూ దగ్గరగా నోట్లు వేసిన పొలాల్లోనూ అధికంగా నత్రజని వాటిని పొలాల్లోనూ మంచు వర్షం ఎక్కువగా పడే వాతావరణం లోను పొలంలో నీడ పడే ప్రదేశాల్లోనూ ఈ తెగులు ఆశించి నష్టం కలుగజేస్తుంది అన్నారు బ్యాక్టీరియా తుంగ, గరిక, ఊద, గాటేరు, వంటి గడ్డి జాతి మొక్కలపై జీవిస్తుంది అన్నారు. ఈ తెగులు లక్షణాలు గమనించినట్లయితే ఆకుల అంచు నుండి కింద వైపుకు నీటి డాగ్ మచ్చలలో ఏర్పడి క్రమేపి ఆకు అంచుల నుండి ఎండిపోవడం మొదలవుతుంది.

తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఈ మచ్చ అంత పూర్తిగా కలిసిపోయి ఆకు అంతా గడ్డి రంగుకు మారి పూర్తిగా ఎండిపోతుంది. కొన్నికొన్ని సందర్భాల్లో మధ్య ఈయనే వెంబడి ఎండిపోయి అంచులు ఆకుపచ్చగా ఉండటం కూడా గమనించవచ్చు. ఇటువంటి పొలాలలో ఉదయం వేళల్లో పంటను కమ్యూనిస్టు తెగులు సోకిన భాగాల నుండి పసుపు రంగులో ఉండే చిగురులాంటి పదార్థం బిందువులలో బయటకు వస్తుంది. క్రమేపీ ఎండ తీవ్రత పెరిగే కొలది ఈ బిందువులు ఎండిపోయి కింద నీటిలో పడిపోతాయి. ఇటువంటి నీటిని ఒక పొలం నుండి మరొక పొలానికి పెట్టడం వల్ల తెగులు ఒక పొలం నుండి మరో పొలానికి నీటిపారుదల వ్యవస్థ ద్వారాను వర్షపు నీటి ద్వారాను వ్యాపించడం జరుగుతోంది అన్నారు.

**–తెగులు యాజమాన్యం (సార్వా మరియు వచ్చే దాల్వాకు)**

తెగులు సోకని ఆరోగ్యం అంతమైన పొలం నుండి మంచి విత్తనం సేకరించాలి తెగులు తట్టుకోలేని ఎంటియు 11 21 ఎంపీలు 12 82 ఎంటియు 12 24 కేఎస్ఆర్ పదహారు 38 వంటి రకాలు విలాంతవరకు సార్వాలో సాగు చేయకూడదు ఒక లీటర్ నీటిలో 1.0 గ్రాములు ప్లాంటోమైసిన్ లేక స్ట్రిప్టో మైసిన్ (స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 90% ం టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరిడ్ 10% ఎస్పీ) కలిపి ఆ నీటిలో విత్తనాలను నానబెట్టి విట్టుకోవడం ద్వారా తెగులు కొంతవరకు నివారించవచ్చు అన్నారు ఒక లీటర్ మందు ద్రావణం ఒక కిలో విత్తనానికి సరిపోతుంది అన్నారు.

తెగులు కలగజేసే బ్యాక్టీరియా నేలలో మొక్కల అవశేషాలలో పంట వ్యర్థాలలో ఉంటుంది కావున నేలను బాగా మరగదమ్ము చేసుకోవాలి అన్నారు. నత్రజని ఎరువులను సిఫార్ చేసిన మేరకే రెండు లేక మూడు దఫాలుగా వాడాలి అన్నారు. స్వర్ణ ఏటుయు రైస్ 1318 ఎంటియు 1282 వంటి రకాలలో సిఫారసు చేసిన 24 కిలోలు ఎకరాకు నత్రజని మాత్రమే వాడాలి.

అధికంగా వాడటం వల్ల బ్యాక్టీరియా ఎండాకుతెగులుఎక్కువగాఆశిస్తుంది.వర్షాలు పడే వాతా వరణంలో ఆకులపై తెగులు లక్షణాలు 5% కంటే ఎక్కువగా వ్యాపించి ఉంటే పై పాటుగా వేయవలసిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేయాలి. సిఫార్సు చేసిన పొటాషి చెరువును యూరేట్ ఆఫ్ పొటాషి రూపంలో 40 కిలోలు ఎకరాకు రెండు తపాలుగా నాట్లువేసి సమయంలోను అంకురం దశలోనూ తప్పనిసరిగా వేసుకోవాలి అన్నారు. ఈ విధంగా వరి పండించే రైతులు సాగు పద్ధతులు పాటిస్తే మంచి ఆరోగ్యకరమైన వరి దిగుబడి లభిస్తుంది అన్నారు.

## స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు అనపర్తి విద్యార్థులు ఎంపిక



**అనపర్తి, మేజర్ న్యూస్ :** స్కూల్ గేమ్స్ ఆఫ్ ఈస్ట్ గోదావరి ఆధ్వర్యంలో మండపేటలో 24వ తేదీన నిర్వహించిన అండర్ 19 బాల్ బ్యాట్మెంటన్ విభాగంలో అనపర్తి గ్రామంలోని శ్రీ రామారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కొల్లి ఆకాష్, నల్లమిల్లి దొర వెంకటకృష్ణారెడ్డిలు పశ్చిమగోదావరి జిల్లాలో జరగబోతున్న రాష్ట్ర స్థాయికి పోటీలకు జిల్లా తరఫున పాల్గొంటున్నట్లు పాఠశాలప్రధానోపాధ్యాయులు పులగం వెంకటరెడ్డి తెలియజేశారు.వీరి ఎంపిక పట్ల వీరితోపాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి. వి. వి. ఎస్ రాఘవరెడ్డి, యన్. శ్రీనివాస్, మోహన్ లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరెడ్డి ,విద్య కమిటీ చైర్మన్ ఎం. పార్వతి, వైస్ చైర్మన్ రాజేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు అభినందించారు.

## జగనన్న కాలనీకి వెళ్లే మార్గం బురదమయం



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట ప్రసన్న ఆంజనేయ నగర్ కాలనీ నుండి జగనన్న కాలనీకి వెళ్లే మార్గం బురదమయంగా మారడంతో ఆ రోడ్డున ప్రయాణించే పలువురు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం కురిసిన ప్రతిసారి మట్టి రోడ్డు పై బురద ఏర్పడడంతో మోటార్ సైకిల్,బైకులు జారీ పలువురు ప్రమాదాల బారిన సైతం పడుతున్నారు. ఈ మార్గంలోనే ఒక ప్రైవేట్ పాఠశాల సైతం ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు రోజుల నుండి పట్టణంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డు పూర్తిగా బురదమైయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి రోడ్డు స్థానంలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చినరాజప్ప



**సామర్లకోట,మేజర్‌న్యూస్:** ప్రజల వద్దనుంచి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తూ అభివృద్ధికి పాటుపడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణ పరిధిలో అన్నపూర్ణ ఫంక్షన్ హాలు నందు మున్సిపల్ కమీషనర్ శ్రీవిద్య అధ్యక్షతన "ఇది మంచి ప్రభుత్వం" 'ప్రజా వేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప బీజేపీ నాయకులు విత్తనాలు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి వందరోజులు ముగిసిన సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, ప్రజలనుంచి సమస్యలు స్వీకరిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో రహదారులు పరిస్థితి దయనీయంగా మారగా వాటి నిర్మాణానికి ప్రాధాన్యత క్రమంలో చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఇంకా ప్రజలకున్న అన్ని రకాల సమస్యలు పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల అధికారులను హాజరు పరుస్తూ తక్షణమే వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీచేస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

### ప్రజా సంక్షేమమే,అభివృద్ధే ధ్యేయంగా వంద రోజుల పాలన

**– తుమ్మలపల్లి రమేష్, కూటమి నాయకులు**



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ గారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సారధ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ వంద రోజులు ప్రజా సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని చెప్పారు.

హామీ మేరకు ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి నాలుగు వేల రూపాయలు పింఛను ఇచ్చామని తెలిపారు. డీఎస్సీ అభ్యర్థుల కోసం పదహారు వేలకు పైగా ఖాళీలను భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటి సంతకం చేశారని గుర్తుచేశారు.ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలో నష్టపోయిన బాధితులకు గత చరిత్రలో లేని విధంగా పరిహారం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.పంచాయితీ రాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ అధికారం చేపట్టిన వందరోజుల పాలనలో గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన పంచాయతీలకు పూర్వపు వైభవం వచ్చేలా కృషి చేస్తున్నారని ఎన్డీఏ నాయకులు అన్నారు. అంతకుముందు గ్రామంలో జరిగిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమలో వారు పాల్గొని పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామాన్ని శుభ్రం చేసి,మొక్కలు నాటారు. పొలం పిలుస్తుంది పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గంగాభవాని,మారిశెట్టి భద్రం,ఎస్వీఎస్ అప్పలరాజు,కుంచె రాజా, సూరంపాలెం బాలు, కుంచే కోటి, నల్లల శివ, పోతుల మోహన్ రావు టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల ఇండస్ట్రియల్ ఫీల్డ్ విజిట్



అనపర్తి, మేజర్ న్యూస్ : వృత్తి విద్యా నైపుణ్యాల పెంపొందించేందుకు ఫీల్డ్ విజిట్‌లు ఎంతగానో దోహదపడతాయి. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష నిర్వహిస్తున్న వృత్తివిద్య కోర్సుల్లో భాగంగా విద్యార్థులకు ఎల్ ఎన్ జె స్కిల్స్ వారి సహకారంతో అనపర్తి బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల కు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించబడింది. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష నిర్వహిస్తున్న వృత్తి విద్య కోర్సులను ఒకేషనల్ కోర్సు టీచర్స్ చే శిక్షణా కార్యక్రమం పాఠశాలలో జరుగుతున్నది దీనిలో భాగంగా ఫీల్డ్ వేయుట జరిగినదని వృత్తి విద్యా నైపుణ్యాల పెంపొందించేందుకు ఫీల్డ్ విజిట్‌లు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయిని కె కళ్యాణి తెలియజేశారు. దీని ద్వారా విద్యార్థినులు తరగతి గదిలో తెలుసుకున్న వివరాలతో ప్రత్యక్ష అనుభవం ద్వారా పని అనుభవమునుసామర్థ్యాలను మెరుగుపరుచు కొనుటకు ఈ ట్రిప్ ద్వారా అవకాశం ఏర్పడిందని అన్నారు. ఇందులో సుమారు 60 మంది, విద్యార్థినులు మరియు టీచర్స్ పాల్గొనుట జరిగినది. ఈ సందర్భంగా వారు పొందుతున్న వృత్తి విద్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక నోషిమ్ మగ్గం డిజైన్ వర్క్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ని సందర్శించుట జరిగినది. సందర్శనలో భాగంగా టెక్స్టైల్స్ మరియు టైలరింగ్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు మగ్గం వర్క్ చేయు విధానం వాటికి కావలసిన సాంకేతిక పరికరాలు, పనిముట్లు,పని చేయు విధానాల గురించి మగ్గం వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్, డిజైన్ వర్క్ మొదలైన వాటిని ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. మగ్గం వర్క్ యజమాని వాటియొక్క పనితీరును ప్రస్తుత సమాజం వాటి అవసరాలకు మరియు అభిరుచులకు అనుగుణంగా చేస్తున్న అనేక డిజైన్లను ఆదాయ వ్యవహారాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ యెన్ నాగమణి, ఎస్ సౌజన్య రాసి, టీచర్స్ టి.శ్రీనివాస్, ఎన్ త్రినాధ్, ఎస్తేరు విజయప్రభ, నళిని, నూకరత్నం, బషీర్ బేగం, వై.బి ఎస్ ఆచార్యులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## స్వచ్ఛత మన బాధ్యతపై నాటకాన్ని ప్రదర్శించిన నాగిరెడ్డి సతీష్ రావు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో తొమ్మిదవ రోజు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్య కార్మికులచే హసన్‌బాద గ్రామ మార్కెట్ సెంటర్‌లో ఉన్న చెత్తను ఎత్తించి శుభ్రపరిచారు.ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం వెంకటరమణ పారిశుధ్య కార్మికుల వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో పంచాయితీ, సచివాలయం, రెవిన్యూ సిబ్బందితో కలిసి చెట్లు నరకడం వలన వచ్చే ఉపద్రవాలు గురించి, చెత్త బయట వేయడం వలన వచ్చే అనేక రోగాల గురించి, మొక్కలను పెంచడం వలన కలిగే ఉపయోగాలు గురుంచి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ "స్వచ్ఛత మన బాధ్యత" అను నాటకాన్ని గ్రామస్థుల సమక్షంలో ప్రదర్శించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు సర్పంచ్ పాత్ర, ఇతర సిబ్బంది వారి వారి పాత్రలు పోషిస్తూ ఈ నాటకం ద్వారా గ్రామస్థులకు స్వచ్ఛతపై మంచి సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సచివాలయం, పంచాయితీ, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'గంజాయి' నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన





రంపచోడవరం, మేజర్ న్యూస్ : గంజాయి నిర్మూలనకు యువత సహకరించాలని, ముఖ్యంగా విద్యార్థులకు దీనిపై అవగాహన ముఖ్యమని గుర్తేడు ఎస్ఐ సాయి కుమార్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దన్, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ ఆడహల్లి ఆదేశాల మేరకు మారేడుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ సి హెచ్.గోపాల కృష్ణ పర్యవేక్షణలో బుధవారం గుర్తేడు సబ్ ఇన్స్పెక్టర్ సాయి కుమార్ మారేడుమిల్లి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లో విద్యార్థులకు కొన్ని ముఖ్యమైన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి దుష్పరిణామాలు, రోడ్డు భద్రత నియమాలు, ర్యాగింగ్ దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్ఐ సాయికుమార్ మాట్లాడుతూ మైదాన ప్రాంతాల నుండి కొంతమంది గంజాయి స్మగ్లర్స్ వచ్చి ఇక్కడి గిరిజన యువకులకు అధిక డబ్బులు ఇస్తామని ఆశచూపి గంజాయి రవాణా చేయుటకు ఉపయోగించుకుంటున్నారని పోలీసులకు సమాచారం ఉందన్నారు. పోలీసు దాడుల్లో అమాయక గిరిజనులు గంజాయి కేసులకు బలవుతున్నారని, కాబట్టి చదువుకునే విద్యార్థులు ఈ విషయాన్ని అర్థం చేసుకుని వారి గ్రామాల్లో సామాజిక బాధ్యత దృష్ట్యా ప్రజలకు అవగాహన కల్పించవలసిందిగా కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి చెడు మార్గాలు యువత ఎంచుకోవద్దని, దానివలన మీ జీవితాలు పాడవుతాయని తెలియజేశారు. కాగా 18 సంవత్సరాలు దాటేవరకు యువత బైక్ డ్రైవింగ్ చేయకూడదని, కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే బైక్ డ్రైవ్ చేయాలని కోరారు. ర్యాగింగ్ వంటి అంశాలకు గిరిజన విద్యార్థులు దూరంగా ఉంటూ అన్నదమ్ములు మాదిరిగా మెలగాలని సూచించారు. విద్యార్థులు అందరూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు ఎస్ ఐసాయి కుమార్ సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకి హెల్మెట్‌లు పంపిణి




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** బుధవారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత జిల్లా కోర్టు ఆవరణలో "రోడ్డు ప్రమాదాల నివారణ" మరియు "హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకత" పై ఆర్ట్స్ కాలేజ్ విద్యార్థులకి విజ్ఞాన మరియు అవగాహనా సదస్సు నిర్వహించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, రాజమహేంద్రవరం వారి సహకారం తో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపే విద్యార్థులకి హెల్మెట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం ప్రమాదకరం మరియు చట్టరిత్యా నేరం అని తెలిపారు. అతి వేగం ప్రమాదకరమని, ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవ్వరు వాహనాలు నడపరాదని విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ ధరించడం శిరస్సు పై బరువుగా భావించుకుండా అది మీ బాధ్యతగా భావించాలి అని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థాయికి చేరుకోవాలని, "హార్డ్ వర్క్ నెవర్ ఫెయిల్స్" అనే సూక్తి ని గుర్తించుకోవాలి అని చెప్పారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు , ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్ర రావు , పొలిటికల్ సైన్స్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ పి.బాబ్జీ , యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఏ.విశ్వేశ్వర రావు, డిప్యూటీ రీజనల్ హెడ్ డి. రామ్మోహన్ రావు , సీనియర్ మేనేజర్లు ఏ. హుస్సేన్ , టి.నాగేశ్వర రావు , బ్యాంక్ సిబ్బంది మరియు ఆర్ట్స్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులు లేని జిల్లాగా కాకినాడ జిల్లా

### – జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పదాల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో పలు జిల్లాల్లో అమలు జరుగుతున్న స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ (ఎస్ఎఫ్ఎల్‌బి) కార్యక్రమాన్ని మరింత విస్తృత పరిచే దిశగా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్లో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ని పదాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో సూర్య ప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పసి పిల్లలపై లైంగిక వేధింపులు నివారించే దిశగా పదాల ఛారిటబుల్ ట్రస్ట్ పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2 నుండి 7 తరగతుల పిల్లలకు పోక్సో యాక్ట్, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి విషయాలు పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ అనే మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పిల్లల భద్రత, రక్షణ మన అందరి బాధ్యత, ప్రతీ స్కూల్‌లో, కాలేజ్‌లో, హాస్టల్‌లో, ఇంట్లో పిల్లలు క్షేమంగా ఉండాలి. ప్రతి పాఠశాలలో అవగాహన తరగతుల ద్వారా చిన్న వయసు లోనే లైంగిక వేధింపుల గురించి తెలుసుకోవడం, వాటి నుంచి తప్పించు కోవడం, రిపోర్ట్ చేయడం వంటి చాలా కీలకమైన అంశాలు పిల్లలు నేర్చుకుంటారు అన్నారు.

పోక్సో చట్టం యొక్క తీవ్రత, లోతు చాలా మంది పేరెంట్స్ కి, టీచర్స్ కి, అధికారులకి కూడా అవగాహన లేదని, ఆ అవగాహన వస్తేనే లైంగిక వేదింపులు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. అక్టోబర్ మొదటి వారం లో జిల్లా స్థాయి అధికారులు (హెచ్‌వోడీలు) అందరితో ఒక అవగాహన సదస్సు ను ఏర్పాటు చేసి, పిల్లలపై లైంగిక వేధింపులు నివారించే దిశగా, మండల స్థాయిలో కమిటీలు ద్వారా మాస్టర్ ట్రైనర్స్ తయారు చేసి, తద్వారా గ్రామ స్థాయిలో ఉన్న ప్రభుత్వ సిబ్బంది సహకారంతో ప్రతీ గ్రామంలో ఉన్న తల్లి దండ్రులకు, పాఠశాలలకు, చైల్డ్ కేర్ సెంటర్లల్లో పిల్లల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం గురించి సరైన అవగాహన కల్పిస్తారు. తద్వారా కాకినాడ జిల్లాను లైంగిక వేధింపులు లేని జిల్లాగా తయారు చేయడమే లక్ష్యం అని కలెక్టర్ షణ్మోహన్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హెచ్.ఎస్.భావన, పదాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో సూర్య ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే రాజప్పను మర్యాదపూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కమీషనర్ విజయలక్ష్మీ



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను క్యాంప్ కార్యాలయంలో బుధవారం శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్‌గా నూతనంగా విధులలో చేరిన కె.విజయలక్ష్మీ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప తెలుపుతూ దేవస్థానంకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలుతో దర్శనాలు, ఉత్తమ సేవలు అందించాలని అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీకి సూచించారు. అనంతరం రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజును అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## టిడిపి హయాంలో అసంపూర్తిగా నిలిచిన ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ అధికారులు



పెరవలి, మేజర్ న్యూస్ : ఉసులుమర్రు గ్రామంలో సెప్టెంబర్ 26వ తేదీ బుధవారం హౌసింగ్ అధికారులు గ్రామంలో ఇంటింటికి తిరిగి టిడిపి హయాంలో ఎన్టీఆర్ ఆవాస్ యోజన పథకంలో ఇల్లు మంజూరై అసంపూర్తిగా మిగిలిన బిల్లు రాని ఇల్లులనుపరిశీలించారు. ఈ సందర్భంగా మండల హౌసింగ్ కార్యాలయ సిబ్బంది జోగారావు మాట్లాడుతూ ముసలోమర్రు గ్రామంలో 28 మందికి చెందిన ఇల్లులకు బిల్లులు రాకుండా అసంపూర్తి నిర్మాణాలతో ఉన్నాయని వారందరి బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నమని త్వరలో వారికి పెండింగ్ బిల్లులు మంజూరుఅవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, జనసేన జిల్లా కార్యదర్శి తులా చినబాబు, ముత్యాల దినేష్, భద్రరావు, జాస్తి ప్రకాష్ రావు, సుంకవల్లి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్సీ, సి హెచ్సిలు డెలివరీ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయ్యాలి

- ఇమ్మునైజేషన్ లక్ష్యం సాధించని ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఇంటింటి సందర్శన సమయంలో హైరిస్క్ గర్భిణీలను గుర్తించాలి
- హై రిస్క్ కేసుల విషయంలో ఏఎన్ఎం
- ఆషా వర్కర్లు గుర్తించిన వాటినివైద్యులు వ్యక్తిగతంగా సందర్శించాలి
- డెలివరీకి వారం ముందే సంబంధిత ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించాలి
- సమ్మె కారణంగా అత్యవసర కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు - కలెక్టర్ పి. ప్రశాంతి




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** హై రిస్క్ గర్భిణుల గుర్తింపు, ఇమ్యూన్నైజేషన్ లక్ష్యాలను సాధించడంలో ఐ సి డి ఎస్, వైద్య ఆరోగ్య శాఖ మధ్య సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తోందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, పి. హెచ్.సి., సి. హెచ్.సి., పరిధిలో ప్రతినెలా నిర్దేశించిన లక్ష్యాలను అనుసరించి ఎన్ని డెలివరీ కేసులకు సంబంధించిన ఎన్ని డెలివరీ కేసులకు హాజరు అవుతున్నారని ప్రశ్నించారు. పిహెచ్‌సి పరిధిలో డెలివరీ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా పి హెచ్ సి పరిధిలో ఐ సి డి ఎస్, వైద్య అధికారులు సంయుక్తంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ధవళేశ్వరం పీ హెచ్ సి పరిధిలో ఎక్కువ డెలివరీ కేసులు నమోదు అవ్వడంలో సంబంధిత మెడికల్ ఆఫీసర్ పని తీరు నిదర్శనం అన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా చొరవ చూపాలన్నారు .ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ డెలివరీ అయ్యే విధంగా నమ్మకం పెంచేలా అధికారులు చొరవ ముఖ్యం అన్నారు. ప్రవేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ కేసులు నెలవారీ డేటా అనాలిసిస్ చేయాలన్నారు. సమ్మె కారణంగా అత్యవసర కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని, అటువంటి సందర్భాల్లో ప్రజల ప్రాణాలని కాపాడడం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. క్షేత్ర స్థాయిలో ఇమ్యూనైజేషన్ అనుకున్న లక్ష్యాలను సాధించడంలో లోపాలను అధిగమించడం, డేటా ఎంట్రీ నమోదు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి తెలియ చేశారు.జిల్లాల , ప్రాంతాల వారీగా గుర్తించిన వ్యాధుల వివరాలు అందచేయాలని ప్రభుత్వం ఆదేశించడం జరిగిందని ఆమేరకు నివేదిక అందచేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. హై రిస్క్ ప్రగ్నెన్సీ విషయంలో బర్త్ ప్లాన్ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాకుండ ప్రవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందడానికి కారణం తెలుసుకోవాలని, వాటికీ సంబంధించి మళ్లింపుకు కారణాలతో ఐసిడిఎస్,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నివేదికలు అందచెయ్యల న్నారు. కంటి వెలుగు సంబంధించి సిఫార్సు చేసిన వాటి యదార్థ స్థితి పై నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. 108, 104 వాహనం సంబంధించి వస్తున్న ఫోన్ కాల్స్, పట్టే సమయం, ఏఏ కేసులకు సంబంధించి సేవలు అందించడం జరిగిందన్న వాటిపై నివేదిక అందచేయాలని పేర్కొన్నారు.

ఈసమావేశంలో డిసిహెచ్ ఎస్ డాక్టర్ ఎన్‌పి పద్మశ్రీ,డిప్యూటి డీఎంహెచ్వో డా ఎన్ వసుంధర, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా ఎమ్. లక్ష్మీ సూర్యప్రభ, ఐసిడిఎస్ పిడి కె విజయ కుమారి, జిల్లా వాస్ట్ర ఆరోగ్య సేవా కో ఆర్డినేటర్ డా పి.ప్రియాంక, ఇతర వైద్యఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.1,50,000 వ్యయంతో శబరి వారధిపై విద్యుత్ వెలుగులు

- ప్రారంభించిన ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలో బుధవారం అర్థశతాబ్దపు అంధకారాన్ని తొలగిస్తూ శబరి నది వారధి పై ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ లక్ష యాభై వేల రూపాయల వ్యయంతో తన సొంత ఖర్చులతో శబరి నది బ్రిడ్జిపై విద్యుత్ కాంతులను లాంఛనంగా ప్రారంభించారు. వారధి నిర్మించి 51 సంవత్సరాలు అవుతున్న విద్యుత్ లైట్లు లేక అంధకారంలోనే ఉంది. తరచూ ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి. ఏ ప్రభుత్వము ఏ నాయకులు పట్టించుకోలేదు. మండల ప్రజలు అనేకమార్లు శబరి వారధిపై విద్యుత్ లైట్లు వేయమని విన్నవించినా కానీ ఎవరు ముందుకు రాలేదు. భారీ వర్షాలు తుఫానులకు తల్లడిల్లిన ప్రజానీకం శబరి వంతెనపై లైట్లు నిర్మించాలని ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌ను కోరగా తక్షణమే సామాగ్రిని తెప్పించి హుటాహుటిన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసి అంధకారానికి చరమగీతం పాడారు. తన జేకే సిటీ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది చీకటి బ్రతుకుల్లో వెలుగులు నింపిన ఆత్మబంధువు అని జమాల్ ఖాన్ సేవలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, టిడిపి నాయకులు మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, శ్రీరామ్, సురేష్ చౌదరి, పొదిలి రామారావు, సీలం తమ్మయ్య, జనసేన నాయకులు మడివి రాజు,పయ్యావుల నాగేశ్వరరావు, ఓబులనేని నరసింహారావు, బేడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### రవాణాశాఖ సూచనలు వాహనదారులు తప్పక పాటించాలి



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** రహదారి ప్రమాదాలు నివారించడంలో వాహన దారులు రవాణా శాఖ సూచనలను పాటి స్తూ వాహనాలు నడపాలని, కొవ్వూరు మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.వి శివప్రసాద్ అన్నారు. కొవ్వూరు పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో కొవ్వూరు రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా కె.వి శివప్రసాద్,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా వి.ఎల్.ప్ర వీణలు బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు నివారించడంలో వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ సమ కాలంలో చేయించాలని, వాహనాలకు తాత్కాలిక ఇన్సూరెన్సును చేయడం వలన ప్రమాదాలు జరిగినప్పుడు వాహనదారులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందనిఅన్నారు. వాహనాలకు తాత్కాలికి ఇన్సూరెన్స్‌లు కాకుండా పర్మినెంట్ ఇన్సూరెన్స్ లు చేయించుకోవ ాలని తెలిపారు.వాహనదారులు వాహనం నడిపే సమయంలో అప్రమత్తతతో వ్యవహరించాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్విచక్ర వాహనంపై ఒకరు లేక ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని ముగ్గురు ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.వి శివప్రసాద్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఐసిడిఎస్ ప్రాజెక్టు బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్, ఆయా పోస్టుల భర్తీని చేపట్టారు. ఆయా ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీలను భర్తీ చేస్తున్నారు. ఇందులో భాగంగా కరప మండలం పెద్ద కొత్తూరు, సిరిపురం లలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టుల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కాకినాడ రూరల్ సిడిపిఓ వై.లక్ష్మి తెలియజేశారు. పెద్ద కొత్తూరు పోస్ట్ బీసీ-బీ, సిరిపురం పోస్ట్ జనరల్ కేటగిరీకి కేటాయించారు. ఈ నెల 25వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకుని అక్టోబర్ 5వ తేదీ లోగా వీటిని అందజేయాలని కరప మండల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ సూచించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు స్థానికంగా నివాసం కలిగి ఉండాలని, సంబంధిత గ్రామ పరిధిలో నివసించే వివాహిత అయి ఉండాలి అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఈ ఏడాది జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుంది అన్నారు. కాకినాడ రూరల్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి దరఖాస్తు తీసుకుని పూర్తి చేసి తిరిగి అదే కార్యాలయంలో ఇచ్చి రసీదు పొందాలని అభ్యర్థులకు సూచించారు. ఇతర వివరాల కోసం ఐసిడిఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలని సూపర్ వైజర్ అన్నపూర్ణ పేర్కొన్నారు.

## గొల్లప్రోలులో అన్న సమారాధన





**గొల్లప్రోలు,మేజర్‌న్యూస్ :** గొల్లప్రోలు పట్టణం రైల్వేటేషన్ సమీపంలో యాదవ కాలనీలో కొలువైయున్న శ్రీకృష్ణ మందిరం వద్ద యాదవ కమిటీ సభ్యులు బుధవారం ఉదయం 10 గంటలనుండి గొర్ల బుల్లి అప్పలస్వామి, గొర్ల నారాయణమూర్తి, రామ్మూర్తి, కొర్ని అప్పారావు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి జయంతి వేడుకలను పురస్కరించుకొని యాదవ్ కమ్యూనిటీ సంఘంఅతిభారీఅన్న సమారాధన కార్యక్రమం ఘనంగానిర్వహించారు.ఈ కార్యక్రమానికి సూరంపేట పాపేసావుడి వీధి, పెదవీధి, రంగప్ప చెరువు, కర్ణం గారి తోట నుండి అధిక సంఖ్యలో కృష్ణ భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని ఈ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.అలాగే ఈ కార్యక్రమానికి జనసేన, వైసిపి, బిజెపి పార్టీల నాయకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్వామివారిని దర్శించుకుని తరించారు.

## రైతుబజార్లో వేలం పాట తగునా!?

- కొందరి కోసం కుట్ర రాజకీయాలు చేస్తున్న రైతు అధికారులు
- పౌర సంక్షేమ సంఘం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ రైతు బజార్‌లో ఇంగ్లీష్ కాయగూరలు అమ్ముకునే వారికి నెలవారీ అద్దె ప్రాతిపదికగా దుకాణాలు కేటాయించిన యంత్రాంగం వాటికి వేలం పాటల మీద అద్దెలు నిర్ణయించే ప్రణాళిక తీసుకురావడం వెనుక కుట్ర జరుగుతున్నదని పౌర సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎటువంటి అద్దెలు లేకుండా ఇక్కడి కాయగూరలు అమ్ముకునే అవకాశం ఇచ్చిన యంత్రాంగం ఇటీవల కాలంలో కొందరి పైలాపచ్చీసు వాతావరణం కారణంగా పిఠాపురం ప్రాంతానికి చెందిన కొంతమంది కాకినాడ రూరల్ కు చెందిన రైతులతో పొసగక అక్కడి మాజీ ఎమ్మెల్యే కి ఇక్కడి కలెక్టర్ కు తప్పుడు పిర్యాదులు చేసి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పని చేయలేదు అంటూ తప్పుడు సంకేతాలు ఇచ్చి రైతు బజార్ నుండి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇదే విషయం మీద కాకినాడ సిటీ ఎమ్మెల్యేకి దగా పడుతున్న రైతులు చింతల పూడి రవి ద్వారా ఎమ్మెల్యే వనమాడి వేంకటేశ్వర రావు ను కలిసి తమ బాధలు చెప్పుకోగా న్యాయంగా వ్యాపారం చేసుకుంటున్న మీకు ఇక్కడ దగా జరగదని రైతు మార్కెట్ అధికారితో మాట్లాడ డం జరిగినా ప్రతీ మంగళ వారం వీరి మీద ప్రతాపం చూపిస్తున్న ధోరణి ఎక్కువయ్యిందన్నారు. ఇంగ్లీష్ కాయగూరలు అమ్ముకునే హక్కు కొంతమందికే ఇవ్వగా ఇతర రైతులు కూడా ఇంగ్లీష్ కాయగూరలు తెచ్చి అమ్మడం వలన వీరు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతు బజార్ అధికారి తమ కేమీ తెలియదన్నట్లుగా లోపాయికారీగా కుమ్మక్కు కావడం వలన జడివాన లాగా విరుచుకు పడుతున్న దుస్థితి ఏర్పడిందన్నా రు. గత ప్రభుత్వంలో ఇదే ధోరణి వుండడం వలన ఇక్కడి రైతులు హైకోర్టు ను ఆశ్రయిం చారు. కోర్టులో వాద నలు మొదలు కాకుం దానే ఇక్కడి కాకినాడ రూరల్ రైతులపై అధికారి ప్రతాపాలు ఎక్కువయ్యాయన్నారు. బదిలీలు లేకుండా కొనసాగుతున్న తీరు వలన కొందరి అధికా రిగా మారారన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వాస్తవాలు గ్రహించి రూరల్ రైతులకు అన్యాయం జరగకుండా చూడా లన్నారు. రూరల్ ఎమ్మెల్యే పంతం వేంకటేశ్వర రావు వాస్తవాలు తెలుసుకుని రైతు బజారు రూల్స్ ప్రకారం నిర్వహణ చేయించాలన్నారు. అడ్డగోలుగా తెస్తున్న సర్క్యులర్స్ వెనుక వున్న కుట్రలను నియంత్రణ చేయాలన్నారు. అనుమతించిన రూల్స్ ప్రకారం ఇంగ్లీష్ కాయగూరలు అమ్ముకునే రైతుల నుండి నెల వారీ అద్దెలు చెక్కించుకుం టున్న రైతు బజార్ యంత్రాంగం అదే రూల్స్ అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రూల్ అమలులో ఉండాలన్నారు. రైతు బజార్ లో జరుగుతున్న కుట్రలకు రైతులు బలికాకుండా వుండేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు స్పందించాలని కోరారు. ఈ అంశంపై రైతు బజార్ ప్రగతి కోసం చర్చా వేదిక నిర్వహిస్తామని పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు తెలిపారు.

### మడేరు వాగులో ప్రత్యక్ష మైన ఆంజనేయ విగ్రహం

- గ్రామంలో ప్రతిష్టించే ప్రయత్నం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని జడ్డంగి గ్రామంలో ఉన్న మడేరు ఆనకట్ట సమీపంలో వాగు వద్దఇసుక దిబ్బల్లో బుధవారం శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం బంగారు వర్ణంలో ప్రత్యక్షమైంది.విషయం తెలుసుకున్న జడ్డంగి గ్రామస్తులు తండోపతండాలుగా వెళ్లి ఆంజనేయస్వామి వారిని ఆసక్తిగా తిలకించి పూజలు చేశారు.మా గ్రామం చేసుకున్న అదృష్టంగా జడ్దంగి వాసులు భావిస్తున్నారు. జడ్డంగి గ్రామ పెద్దలు యువకులు చుట్టూ ఇసుక తొలగించి విగ్రహాన్ని తీసి, సమీపాన రామాలయం వద్దకు తరలించారు.గ్రామస్తులు నిర్ణయించుకుని మంచి ముహూర్తాన మంచి ప్రదేశంలో ప్రతిష్ఠ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు గణజ్ఞాల తాతారావ్, లారీ యూనియన్ ఉపాధ్యక్షులు చిలకచర్ల వీరబాబు,యువకులు కొంగర నాగు,జనపరెడ్డి పండు,ముంతా మల్లేశ్వరరావు, గణజాల నారాయణరావు,గణజాల త్రిమూర్తులు, కంటపురెడ్డి సత్యనారాయణ ,ప్రసాద్, కొఠారివీరబాబు తోటగుణ,యువకులు,మహిళలు మరియు స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ చినబాబు,పోలీసు సిబ్బంది దుర్గారావు, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## కానూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ సెంటర్ల పౌష్టికాహార మాసోత్సవాలు



పెరవలి, మేజర్ న్యూస్ : కానూరు గ్రామంలో కానూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడి సెంటర్లు సెంటర్లు సంయుక్తంగా సెప్టెంబర్ 25 వ తేదీ బుధవారం కానూరు హై స్కూల్ వద్దపౌష్టికాహారమాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెరవలి మండలం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కోలా సీతయ్య నాయుడు ఆర్థిక సహాయంతో గర్భిణీలకు చీర, గాజులు, పళ్ళు, పసుపు, కుంకుమలు తో శ్రీమంతాలు నిర్వహించారు. అంగన్వాడి పిల్లలు హై స్కూల్ పిల్లలు చే ఆడపిల్లల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హూమన్ ట్రాఫికింగ్ పై చక్కటి స్టేజి ప్రదర్శనలు ఇప్పించారు. ఈ స్టేజ్ ప్రోగ్రాంలో పాల్గొన్న పిల్లలకు పెరవలి మండలం లైన్స్ క్లబ్ నెంబర్ బూరుగుపల్లి రాజు ఆర్థిక సహాయంతో బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఓ శ్రీలక్ష్మి బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ముర్రిపాల విశిష్టతను తెలియజేశారు.తల్లిపాలతో పాటు అంగన్వాడి సెంటర్లు లో ఇచ్చే బాలామృతం విశిష్టతను తెలియజేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న అంగన్వాడి సూపర్వైజర్ వి సరోజినీ మాట్లాడుతూ బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తోపాటు తీసుకోవలసిన సమతుల్య ఆహారం గురించి వివరించారు. అంగన్వాడి సెంటర్లు అందించే సేవలు గురించి సభకు వచ్చిన వారికి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీలక్ష్మి సూపర్వైజర్ వి సరోజినీ గ్రామ సర్పంచ్ భావన మధు పూర్ణ చందు, జడ్పిటిసి కొమ్మిశెట్టి రామాంజని కిచ్చు ఎంపీటీసీ కోలా లక్ష్మీపార్వతి పెరవలి మండలం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కోలా సీతయ్య నాయుడు లైన్స్ క్లబ్ నెంబర్ బూరుగుపల్లి రాజు కూటమి నాయకులు అంగన్వాడి టీచర్లు ఆయాలు కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కిషోర్ బాలికలు డ్వాక్రా మహిళలు గర్భిణీలు కానూరు హై స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పంచాయితీరాజ్ జిల్లా పరిపాలనాధికారి డా.నందిక మహాలక్ష్మి కుమార్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : తూర్పు గోదావరి జిల్లా పంచాయితీరాజ్ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ గా పనిచేస్తున్న డా? నందిక మహాలక్ష్మి కుమార్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్ ను హర్యానా గవర్నర్ చేతుల మీదుగా సెప్టెంబరు 19 న గురువారం హైదరాబాద్ లోని గవర్నర్ క్యాంపు కార్యాలయంలో అందుకున్నారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారి చేతుల మీదుగా ఈ అవార్డ్ ను ఆయన అందుకున్నారు. గవర్నర్ క్యాంప్ కార్యాలయం, హైదరాబాద్ లో ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం జరిగింది. విద్యాధికుడు, నిత్యాభ్యాసి అయిన డా.మహాలక్ష్మీ కుమార్ దాదాపు 50 డిగ్రీలు చేసి ఎందరికో స్ఫూర్తి గా నిలిచినట్లు గవర్నర్ అభినందించినట్లు మహాలక్ష్మి కుమార్ తెలిపారు. అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు గౌరవ సలహాదారునిగా ఉంటూ, ప్రభుత్వ ఉద్యోగులకు కండాక్ట్ & సర్వీస్ రూల్స్ పై శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పోటీ పరీక్షలకు వెళ్ళే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందజేస్తున్ననని, అనేక మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చిన్నట్లు తెలిపారు. “వర్ణధార హెల్త్ ఆర్గనైజేషన్” సంస్థ ద్వారా ఉచితం గా కౌన్సిలింగ్, సైకోథెరపి మొదలైన సేవల ద్వారా ఎంతో మందికి చేయూతనిస్తున్నారు. అవార్డు పొందిన సందర్భంగా జిల్లా పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ అధికారి మహమ్మద్ అలిముల్లా, సిబ్బంది, ఇతర జిల్లా అధికారులు, యస్.ఆర్.ప్రింటర్స్ నాగులపల్లి సురేష్కుమార్, సామాజికవేత్త వనం శ్రీనివాస్, అత్తిలి రాజు తదితరులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చైల్డ్ క్యాన్సర్ అవగాహన సదస్సు - డా.పట్నాల






రాజమండ్రి, మేజర్ న్యూస్ : లయన్స్ క్లబ్ రాజమహేంద్రి ఆధ్వర్యంలో ఎ.కె.సి. జూనియర్ కళశాల ఆవరణ లో చైల్డ్ క్యాన్సర్ అవేర్నెస్ నెలలో భాగంగా ఎకెసి కళాశాల విద్యార్థులకు చంద్రకళా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ పట్నాల విశ్వనాథ్‌చే చైల్డ్ క్యాన్సర్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలు జంక్ ఫుడ్ వినియోగం, సెల్‌ఫోన్ రేడియేషన్, సరైన వ్యాయామం లేకపోవడమే పిల్లల్లో క్యాన్సర్ కి ప్రధాన కారణమవుతుందని, ఆడియో, వీడియో దృశ్య మాధ్యమాలతో వివరించారు. వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే చికిత్సకు అవకాశం ఉంటుందని చెప్పారు. లయన్స్ వంటి అంతర్జాతీయ సేవా సంస్థ యిటువంటి కార్యక్రమాలు నగరాలతోపాటు గ్రామీణప్రాంతాలలో నిర్వహించాల్సిందిగా సూచించారు. పిల్లలో ఇటువంటి వ్యాధుల పట్ల తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంవల్ల భవిష్యత్‌లో అనేక సమస్యలకు దారితీసే ప్రమాదం వుందన్నారు. లయన్స్ క్లబ్ రాజమహేంద్రి ఇటువంటి వైద్య ఆరోగ్య అంశాలపై ముమ్మరంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. క్లబ్ అధ్యక్షులు మద్దుల వి.ఎస్.శ్రీరామ గుప్త అధ్యక్షత వహించగా, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్లబ్ కార్యదర్శి వెన్నా కుమారస్వామి వందన సమర్పణ చేయగా, క్లబ్ అడ్మిన్ గ్రంథి వసంత కుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ట్రెజరర్ రాఘవరావు, జయశ్రీ, లయన్ మాధవరావు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తున్న కూటమి ప్రభుత్వం

- ఎంపి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్




**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** రాష్ట్రంల సంక్షోంభంలో ఉన్నా సరే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో అర్హులైన వార్కి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం, డిప్యూటి సిఎంలకే దక్కిందని, కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పెద్దాపురం మండలం, పులిమేరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం, ప్రజావేదిక కార్యక్రమం గ్రామ సర్పంచ్, టిడిపి నాయకులు తుమ్మల నానిల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని మాట్లాడుతూ ప్రజా వేదిక వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఎన్నికల హామీలలో భాగంగా టీచర్ పోస్టుల భర్తీలు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, 4వేల రూపాయల పెన్షన్, 1వ తేదినే ఉద్యోగస్థులకు జీతాలు, అన్నా క్యాంటన్‌ల ఏర్పాటు, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని వారు తెలిపారు. దీనికి ముందుగా గ్రామంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనపై పంచాయతీ సెక్రటరీ బి.బి.వి.వి.రమణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నరాలశెట్టి బాబ్జీరావు, పలువురు నాయకులు, ఎంఇఓ-2 వి.ఆరఎ.కె.చౌదరి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పలు శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.